క్లుప్తంగా

పార్కింగ్ స్థలానికి టెండర్లు ఆహ్వానించాలి

వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రథం సెంటర్‌లో ఉన్న పార్కింగ్ స్థలానికి వీఎంసీ అధికారులు టెండర్లు ఆహ్వానించాలని మున్సిపల్ కమిషనర్‌ను వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కెనాల్ రోడ్డు వినాయక స్వామి గుడి నుంచి రథం సెంటర్ వరకు, ఫ్లైఓవర్ కింద ఉన్న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పార్కింగ్ స్థలం లీజు దాదాపు రెండు నెలల క్రితమే పూర్తయిందన్నారు. నేటి వరకు ఆ పార్కింగ్ కాంట్రాక్టు టెండర్లను పిలవలేదని, దీంతో సదరు కార్పొరేషన్ పార్కింగ్ స్థలంలో కొంతమంది అమ్మవారి ఆలయ పార్కింగ్ టోకెన్లను జారీ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కారణంగా కార్పొరేషన్ పెద్ద ఎత్తున ఆదాయం నష్ట పోతుందన్నారు. వీఎంసీ తక్షణమే స్పందించి సదరు పార్కింగ్ లీజు విషయంపై టెండర్ ఆహ్వానించాలని కోరారు. గతంలో ఈ పార్కింగ్‌ను తక్కువకు టెండర్ కట్టబెట్టారని, అధిక మొత్తంలో చెల్లించేందుకు సిద్ధమని కొంతమంది కోర్టును కూడా ఆశ్రయించి ఉన్నారన్నారు. వారి ప్రతిపాదనను కూడా పరిగణలోకి తీసుకొని అధిక ధరకు, వీఎంసీకి ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గురువుకు అధిక ప్రాధాన్యం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యధిక ప్రాధాన్యముందని కూరపాటి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అన్నారు. కూరపాటి హైస్కూల్ ఆవరణలో గురుపౌర్ణమి వేడుకలను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత యుగంధరాచార్య వ్యాసభగవానుని చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు మనకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తాడని చెప్పారు. ఆషాఢ పౌర్ణమి వ్యాసభగవానుడు పుట్టిన రోజు అని, దానినే వ్యాస పూర్ణిమ అని గురు పూర్ణిమ అంటారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను, ప్రిన్సిపాల్‌ను విద్యార్థులు సత్కరించారు.

కొండప్రాంతవాసులూ అప్రమత్తం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వాటర్ ట్యాంక్, బ్రహ్మం గారి మఠం, సారంగం కొండ ప్రాంతాల్లో శనివారం వైఎస్సార్ సీపీ నేతలు పర్యటించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రమాదకరంగా మారిన రిటైనింగ్ వాల్స్‌ను పరిశీలించారు. కొండ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను కార్పొరేషన్ అధికారులకు తెలియజేశారు. ప్రజలు పాటించాల్సిన జాగ్రత్త గురించి మైక్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, దుక్క దుర్గారావు, ఊతకొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.









కనులారా.. మనసారా..

వనదేవత శతాక్షీదేవిని భక్తజనం కనులారా.. మనసారా దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై శనివారం శాకంబరీ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దుర్గగుడితోపాటు ఇతర ఉపాలయాల్లో దేవతామూర్తులను కూరగాయలతో అలంకరించారు. అమ్మవారి ప్రధాన ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సొరకాయలు, దొండకాయలు, బెండకాయలు, కరివేపాకు, నిమ్మకాయలతో అందంగా అలంకరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు, శాకంబరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తబృందాలు అమ్మవారికి సారె సమర్పించాయి. ఎడతెరపి లేకుండా వాన కురుస్తున్నా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. **–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ**



క్యాంపస్ సెలక్షన్‌లో 14 మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో శ్రీరామకృష్ణ, అధ్యాపకులు

మైలవరం: దివీస్ లేబొరేటరీస్ హైదరాబాద్ యూనిట్ మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి దివీస్ లేబొరేటరీస్ హెచ్‌ఆర్ శ్రీరామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించి 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ వి. ఫణికుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వెంకటాద్రి పర్యవేక్షించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయిబాబా మందిరాల్లో నిర్వహిస్తున్న వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీ (పాతది)లోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో రెండో రోజు శనివారం ఉదయం 6 గంటలకు భక్తులు బాబా విగ్రహాన్ని చెరకు రసంతో అభిషేకించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర కృష్ణానది నుంచి 108 మంది ముత్తయిదువులు, కన్యలు 108 కలశాలతో తీసుకువచ్చిన కృష్ణాజలానికి శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం భక్తులు బాబాకు జలాభిషేకం చేశారు. కార్యక్రమాలను పాలకవర్గ సభ్యులు బూర్లె వెంకటేశ్వరరావు, చందలూరి రాజశేఖర్, వూటుకూరి శివన్నారాయణ, మోటుమర్రి సుబ్బారావు, పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్టపై సాయిబాబా మందిరంలో

భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమ రామలింగేశ్వర స్వామివార్ల మందిరంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఉమా రామలింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 108 మంది ముత్తయిదువలతో సాయి సత్య వ్రతాలు జరిగాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాద వితరణ, సాయంత్రం సాయి పల్లకి సేవ (ఊరేగింపు) జరుగుతాయని మందిర అర్చకులు గురుజాడ బాల చంద్రశేఖర శర్మ తెలిపారు. ఆలయ ధర్మకర్త పాములపాటి దుర్గాప్రసాద్, మధుబాల దంపతులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలోని గుడిలో కలశపూజ చేస్తున్న భక్తులు

వాహన పోర్టల్ సర్వర్‌తో ఇబ్బందులు

లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుల ఆవేదన

పటమట/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలు అందించే వాహన్ పోర్టల్ సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు అన్నారు. స్థానిక బెంజ్‌సర్కిల్‌లో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ఈ–ప్రగతితో పాటు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ వాహన్ ద్వారా సేవలు అందించారని, ఇకపై ఈ–ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ లోనే అన్ని సేవలను అందించేందుకు నిర్ణయించి పైలట్ ప్రాజెక్టులుగా ఎన్టీఆర్ జిల్లాను ఎంపిక చేశారన్నారు.

ఈ–ప్రగతి నుంచి వాహన్ వెబ్‌సైట్‌లో చేపట్టిన డేటా బదలాయింపు ప్రక్రియ వల్ల వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా మాట్లాడుతూ వాహన్ వెబ్‌సైట్ సర్వర్ నెమ్మదిగా ఉండటం, ఈ–ప్రగతిలో ఉండే అనేక మాడ్యూల్స్ అందులో లేకపోవడంతో వాహనాల డేటా ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ జాప్యమవుతోందన్నారు. గత పదిహేను రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలోని లారీలకు సంబంధించిన ట్రాన్స్‌ఫర్, రెన్యువల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీల జారీ, త్రైమాసిక పన్నులు, ఈ–చలాన్ల చెల్లింపు, ఈ–పర్మిట్ల జారీ తదితర సేవలు నిలిచిపోయానని చెప్పారు. సంఘ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సర్వర్‌లో డేటా బదలాయింపును వాహనాల సంఖ్య ఎక్కువగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాను కాకుండా తక్కువగా ఉండే జిల్లాను ఎంపిక చేసుకోవాలన్నారు.



మాట్లాడున్న సంఘ నేతలు

3, 4 తేదీల్లో నూతన జాతీయ విద్యా విధానంపై సదస్సు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా), అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యా విధానం అమలులో ఎదురయ్యే సవాళ్లపై ఆగస్టు 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు స్పా కళాశాల సంచాలకుడు ఆచార్య కొండా రమేష్ చెప్పారు. ఈ సందర్భంగా సదస్సు పోస్టర్‌ను కళాశాల ప్రాంగణంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే జాతీయ సదస్సును విజయవాడలోని తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో సదస్సులో పాల్గొంటారని తెలియజేశారు. జాతీయ నూతన విద్యా విధానంతో కలిగే ప్రయోజనాలు, ఆశించిన లక్ష్యాలు, అమలులో ఎదురయ్యే సవాళ్లు, వాటికి పరిష్కారాలు వంటి అంశాలను చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య వైవీ రామిరెడ్డి, డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ బాలకృష్ణ, సీహెచ్ కార్తీక్, ఆర్.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డిగ్రీ విద్యార్థి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కుమ్మరి పాలెం సెంటర్‌కు చెందిన ఆనంద్ కేబీఎన్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం తల్లిదండ్రులు నిద్ర లేచి చూసే సరికే ఆనంద్ కనిపించలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. ఆ సమయంలో ఆనంద్ తన అన్న గౌతమ్ సెల్‌ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పంపాడు. ఫోన్ పేలో డబ్బులు పోయాయని, వాటి కోసం వెళ్తున్నాను, పది రోజుల్లో తిరిగి వస్తానని మెసేజ్ పంపాడు. రూ. లక్ష బ్యాలెన్స్ ఉన్న ఏటీఎం కార్డు అతని వద్దే ఉందని, తమ బిడ్డ ఆచూకీ తెలియజేయాలంటూ ఆనంద్ తండ్రి ఆంజనేయులు భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నాణ్యమైన మాంసం ఉత్పత్తులు విక్రయించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మాంసం ఉత్పత్తులు విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మాంసం, చేపల విక్రయదారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మాంసం విక్రయదారులు వాణిజ్యపరమైన లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మాంసం, చేపల విక్రయాలు బహిరంగ ప్రదేశాల్లో చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. చట్టపరిధిలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో శాకంబరీదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. అమ్మవారికి కాయగూరలతో అలంకరించిన అనంతరం విశేష కుంకుమార్చనలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఉత్సవాల చివరి రోజు, గురు పౌర్ణమి నేపథ్యంలో మరింతగా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు. ఉత్సవాలను కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గంగానమ్మ ఆలయంలో

భీమనవారి పేటలోని శ్రీ గంగానమ్మ దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం అమ్మవారికి వివిధ రకాల కాయగూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీహరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు ఆదివారం పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని పేర్కొన్నారు..



మహాలక్ష్మీదేవికి కూరగాయలతో అలంకరణ

తిరుపతమ్మ గుడి కొండపై కూలిన ప్రహరీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి 45వ డివిజన్ పరిధిలోని కబేళా సెంటర్‌లోగల తిరుపతమ్మ గుడి కొండపై ఒక ఇంటి ప్రహరీ కూలి పక్కంటిపై పడింది. ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరగడంతో ఆస్తి నష్టం మినహా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతమ్మ గుడి కొండపైన వల్లభాపురం కోటేశ్వరరావు, ఆయన సోదరుడు కగావ్ నివసిస్తున్నారు.

నానుడు వర్షం కారణంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2.30 గంటల సమయంలో కగావ్ ఇంటి ప్రహరీ కూలి పక్కనే ఉన్న కోటేశ్వరరావు ఇంటిపై పడింది. దీంతో ఆయన ఇల్లు పూర్తిగా దెబ్బతింది. విషయం తెలిసిన సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు కమిటీ సభ్యులతో కలిసి శనివారం కొండ ప్రాంతంలో పర్యటించి పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు.



కూలిన ప్రహరీ గోడ

కొండప్రాంతంలో సీపీఎం బృందం

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండప్రాంతాల్లో కొండరాళ్లు దొర్లి ప్రజల ఆస్తులు ధ్వంసమైన ఘటనలపై ప్రజలు భయందోళనలో జీవిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబుతో కలసి ఆయన కొండ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నగరంలో 16 డివిజన్లలోని కొండ ప్రాంతాల్లో రెండు లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. వారి మౌలిక వసతులకు రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ. 100 కోట్ల నిధులను రాష్ట్రప్రభుత్వం గ్రాంట్ల రూపంలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు ప్రజాప్రతినిధులు కొండ ప్రాంత ప్రజల ప్రాణాల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు ఈవీ నారాయణ. పి.రాజు, జి.నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంగట్టు కొండప్రాంతంలో పరిశీలిస్తున్న బాబూరావు

అభివృద్ధికి అధికారులు సహకరించాలి

విజయవాడరూరల్: మండలంలో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు చేస్తున్న ప్రతిపాదనలకు అనుకూలంగా అధికారులు వ్యవహరించి గతంలో మాదిరిగానే అభివృద్ధి పనులు జరిగే విధంగా పనిచేయాలని అన్నారు. తహసీల్దారు పి.జాహ్నవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజూ గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణల గురించి అధికారులకు తెలియజేస్తే వాటిని తొలగిస్తామని చెప్పారు. పాతపాడు, అంబాపురం గ్రామాల్లో పైపులైను లీకేజీ బాగా జరుగుతోందని గ్రామ సర్పంచి గండికోట సీతయ్య తెలిపారు. ఎనికేపాడు గ్రామంలో నాడు–నేడు కింద నిర్మించిన భవనం పనులు చివరిదశలో ఆగిపోయాయని, మిగిలిన పనులు చేపట్టాలని సర్పంచి పూర్ణచంద్రరావు కోరారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న తనను నున్న గ్రామ సర్పంచి భర్త కాటూరి శ్రీనివాసరావు హేళనగా మాట్లాడి, మండలం నుంచి నిధులు తెచ్చుకొని పనులు చేసుకోవాలని అన్నారని ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.

లోపలకు వెళ్లాలంటే ఇబ్బందులే!

- గుణదల కొండకు వెళ్లే దారిలో ఆక్రమణలు
- ఏలూరు రోడ్డులో ఆర్చి ఎదురుగా రద్దీ అధికం
- రోడ్డు దాటాలంటే భక్తులకు అవస్థలే..

గుణదల(విజయవాడతూర్పు): గుణదల మేరీమాత కొండపైకి వెళ్లే దారి వద్ద ఆక్రమణలు, వాహనాల రద్దీ విశ్వాసులకు ఇబ్బందికరంగా మారాయి. గుణదల కొండకు చేరుకునే విశ్వాసులు ప్రమాదాలు, సమస్యలను దాటుకుంటూ మరియతల్లిని చేరాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఇదే సమస్య ఉన్నా పరిష్కార 'బాట' చూపడం లేదు.

ఆధ్యాత్మిక శిఖరం

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం దేశంలోని అతి పెద్ద క్రైస్తవ ఆలయాల్లో పెద్దది. నూరు వసంతాలుగా భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలిచిన ఆధ్యాత్మిక శిఖరం. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు ఇక్కడకు చేరుకుని మరియమాతను దర్శించుకుంటారు. తమ మొక్కుబడులు చెల్లించుకుని ఆధ్యాత్మికంగా గడుపుతారు. ఏటా ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో జరిగే మేరీమాత ఉత్సవాలు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి. ఆ తిరునాళ్లకు దేశ విదేశాల నుంచి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

ఇదీ సమస్య..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి రోడ్డు, రైలు మార్గాల ద్వారా నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. కానీ పుణ్యక్షేత్రం ఆవరణలోకి అడుగు పెట్టడం భక్తులకు పెను సవాలుగా మారుతోంది. జిల్లాలు,రాష్ట్రాలు దాటి గుణదలకు వచ్చినా పుణ్యక్షేత్రం ఆవరణలోకి చేరుకోవడం సమస్యాత్మకంగా ఉంది. ప్రధాన మార్గమైన ఏలూరు రోడ్డుకు చేరుకునే భక్తులు ఆ దారిలో వాహనాల రద్దీని దాటుకుని, ప్రమాదపుటంచున ఆలయానికి వస్తున్నారు. మరియమాత ఆలయానికి వస్తున్న యాత్రికులు ఏలూరు రోడ్డుపై వాహన ప్రమాదాలకు గురై క్షతగాత్రులైన సంఘటనలు లేకపోలేదు.

ఆక్రమణలో ఆలయం రోడ్డు.

గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద ఉన్న వీఎంసీ రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. సమీపంలోని చిరు వ్యాపారులు యాత్రికులను ఆకర్షించేందుకు రోడ్డు పైకి తమ దుకాణాలను వ్యాప్తి చేస్తున్నారు. రోడ్డుపైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏలూరు రోడ్డు ప్రధాన ఆర్చి తర్వాత అత్యంత ప్రాతినిధ్యం ఉన్న రోడ్డు ఇదే. వ్యాపారుల ఆక్రమణలతో యాత్రికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పరిష్కారం చూపాలి..

ఆలయ ప్రతిష్ట కోసం, యాత్రికుల సమస్యల పరిష్కారానికి వీఎంసీ అధికారులు, ఆలయ సిబ్బంది అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ముఖ్యంగా ఏలూరు రోడ్డు ఆర్చి వద్ద ఫుట్‌బ్రిడ్జి నిర్మించాలని యాత్రికులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డుపై ప్రమాదాల బారిన పడకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయం ఎదుట ఉన్న రోడ్డుపై ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పుణ్యక్షేత్ర ప్రధానాలయ పరిసర ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని ఆలయ సిబ్బంది తెలుపుతున్నారు.



మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద వాహనాల రద్దీ

ఫుట్‌బ్రిడ్జి నిర్మించాలి

పుణ్యక్షేత్రానికి చేరుకునే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వ అధికారులు స్పందించాలి. ఏలూరు రోడ్డుపై వాహనాల రద్దీ కారణంగా యాత్రికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఫుట్‌బ్రిడ్జి అనివార్యం. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద రోడ్ల ఆక్రమణలు యాత్రికులకు అసౌకర్యంగా ఉన్నాయి. వీఎంసీ అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

–ఫాదర్ యేలేటి విలియం జయరాజు, పుణ్యక్షేత్ర రెక్టర్

మనోహరం... సంప్రదాయ నృత్యం

విజయవాడ కల్చరల్: అరుణోదయ కళాసమితి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా శనివారం శివరామకృష్ణ క్షేత్రంలో నాట్యాచారిణి పక్కి మంజూష బృందం ప్రదర్శించిన భరతనాట్య, కూచిపూడి సంప్రదాయంలో ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. నివేదితశ్రీ, చక్రిక, శ్రీనిష, జస్మిత కుమారి, శ్రీనిష, తేజశ్రీ, తాన్విత, చైత్రవర్ధని, వర్ష స్వాగత నృత్యం అలరించాయి. ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాలను గౌరవించుకోవాలని సూచించారు. భావి తరాలకు కూచిపూడి విలువవలను తెలియ జేయడానికి కృషిచేస్తున్న మంజూషను అభినందించారు. నాట్యాచారిణి మంజూష మాట్లాడుతూ బాల బాలికలను తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ ఫీల్డ్ అధికారి ఐన్ మూర్తి, సంఘసేవకురాలు మాధవీలత తదితరులు పాల్గొన్నారు. మంజూషను సత్కరించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

అమ్మ అనురాగం.. కరుణా సముద్రం

విజయవాడ కల్చరల్: అమ్మ అనురాగం కరుణా సముద్రమని త్రిభాషా మహాసహస్రావధాని పద్దిపర్తి పద్మాకర్ అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యాన తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజులపాటు నిర్వహించే శ్రీ దుర్గాదేవి మహిమ ఆధ్యాత్మిక ప్రసంగం శనివారం ముగిసింది. పద్మాకర్ మాట్లాడుతూ బ్రహ్మాది దేవతలు అమ్మను కొలుస్తారని, అమ్మనామమే తారక మంత్రమని వివరించారు. మనలోని శక్తి అంతా అమ్మ అనుగ్రహంతోనే సాధ్యమన్నారు. మనిషి చేసుకున్న పాప పుణ్యాలకు తప్పకుండా ఫలితం అనుభవించాల్సిందేనన్నారు. యజ్ఞయాగాదులతో లోక శాంతి కలుగుతుందని వివరించారు. దుర్గగుడి ఈఓ రామారావు మాట్లాడుతూ విజయవాడ నగరం సంస్కృతి సంప్రదాయాలకు నిలయన్నారు. కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సభను సమన్వయ పరిచారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయి లిఖిత ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. పద్మాకర్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

